రహదారులా ఇవి?

- నరకానికి నకళ్లుగా మారిన భీమడోలు రోడ్లు
- ప్రధాన సెంటర్లన్నీ గోతులమయమే



భీమడోలు జంక్షన్ నుంచి రైల్వే గేటు రోడ్డుపై మెటల్ చెల్లా చెదురుగా పడి వాహనదారులకు ఇబ్బందిగా ఉన్న దృశ్యం

భీమడోలు: మండల కేంద్రం భీమడోలులో రహదారులపై భారీగోతులు ఏర్పడడంతో ప్రజలు రోడ్లపై ప్రయాణించాలంటేనే వణికిపోతున్నారు. నిత్యం ప్రమాదాలు జరుగుతుండడంతో ప్రజలు నరక యాతన పడుతున్నారు. ప్రధాన రహదారుల పరిస్థితి చెప్పనవసరం లేదు. రోడ్ల అభివృద్ధి, గుంతలు పూడ్చే పనులు నత్తనడకన సాగుతున్నాయి. సంక్రాంతి నాటికి గోతులు పూడ్చే పనులు పూర్తి చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించినా క్షేత్ర స్థాయిలో అందుకు భిన్నంగా పరిస్థితులు దర్శనమిస్తున్నాయి. మూడు నెలలుగా ఈ పనులు సాగుతూనే ఉన్నాయి. కొన్ని రహదారుల గుంతలు పూడ్చుతున్నా కాంట్రాక్టర్‌కు బిల్లులు మంజూరు కాక పనులు పురోగతిని నిలిచి ఎక్కడ పనులు అక్కడే అన్న చందంగా మారింది. అదే గ్రామంలో పూర్తి స్థాయిలో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు చాలక కొంత మేరకు పనులు అర్థాంతరంగా నిలిచాయి. దీనితో రోడ్లపై రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన దుస్థితి ఏర్పడుతుందని స్థానికులు వాపోతున్నారు. రాష్ట్ర రహదారి భీమడోలు జంక్షన్ టూ రైల్వే గేటు వరకు గల ఆర్ అండ్ బీ రోడ్డు అధ్వాన్నంగా మారింది. నవంబర్‌లో ఆట్టహాసంగా రహదారి మరమ్మతు పనులు చేపట్టిన పనులు సాగక... రహదారిపై పర్చిన మెటల్ రోడ్డుపైకి జారిపోవడం, భారీ వాహనాల వల్ల గోతుల్లో వేసిన మెటల్ పౌడర్‌లా మారడంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో రాకపోకలు సాగించాలంటేనే ప్రజలు, భక్తులు వాహనదారులు భీతిల్లిపోతున్నారు. ద్వారకాతిరుమల పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తులకు ఈ రహదారి సులువైన దారి కావడంతో ఈ రోడ్డు వెంబడి గుడికి చేరుకుంటున్నారు. దీనితో భక్తులు పడే పాట్లు వర్ణనాతీతంగా మారింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఈ రోడ్డు మరమ్మతులకు రూ.10లక్షల మంజూరు కాగా కూటమి ప్రభుత్వం మరో రూ.5లక్షల మంజూరు చేసింది. కేవలం నెల రోజుల్లో పూర్తి చేయాల్సిన గుంతలు పూడ్చే పనులు నత్తతో పోటీ పడుతున్నాయి. అరకొరగా చేసిన పనులు వల్ల వాహనాలు రాకపోకలతో రహదారిపై దుమ్ము లేస్తుంది. కనీసం వాటర్‌తో కూడా తడపడం లేదు. ఈ పనులు ఎప్పటికి పూర్తి అవుతాయోనన్న స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గుంతలు పూడ్చేందుకు ఇంత కాలం పడితే పూర్తి స్థాయి రోడ్డు వేసేందుకు ఇంకెంత కాలం పడుతుందోనని ప్రజలు విమర్శించారు. ఇకనైనా పాలకులు స్పందించి రోడ్ల పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

భీమడోలు జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న భీమడోలులోని గ్యాస్ గుడౌన్ రోడ్డును సీసీ రోడ్డుగా మార్చేందుకు ఉపాధిహామీ పథకం నిధులు రూ.40లక్షలతో ప్రారంభించారు. పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో ఈ పనులు జరుగుతున్నాయి. మొత్తం 600 మీటర్లకు గాను 140 మీటర్ల మేర రోడ్డు పనులు అసంపూర్తిగా నిలిచిపోయింది. అదనపు నిధులు కోసం సంబంధిత అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

సంక్రాంతి తర్వాత పనులు ప్రారంభం

భీమడోలు జంక్షన్ నుంచి రైల్వే గేటు వెంబడి ఒక వైపు పనులు దాదాపు పూర్తి అయ్యాయి. మరోపక్క పనులు నిలిచాయి. కూలీలు కొరత వల్ల పనులకు ఆటంకంగా కలుగుతుంది. కాంట్రాక్టర్ పనులు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. అయితే కూలీలు కొరత వల్ల ఇబ్బందులు పడుతున్నారు. గుంతలు పూడ్చే పనులు సంక్రాంతి తర్వాత ప్రారంభమవుతాయి. రోడ్డుపై రాకపోకలు సాగించే తరుణంలో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి. ప్రజలు ఆందోళనలు చెందనవసరం లేదు.

– జి.భాస్కరరావు,
ఇంచార్జి ఏఈ, ఆర్ అండ్ బీ, భీమడోలు



భీమడోలులోని గ్యాస్ గోడౌన్ రోడ్డులో అసంపూర్తిగా నిలిచిన సీసీ రోడ్డు పనులు



పౌడర్‌గా మారిన మెటల్



రోడ్డుపై భారీ గోతులు

క్లుప్తంగా

గుర్రపు డెక్క తొలగింపు పనుల పరిశీలన



సత్యనారాయణపురం వద్ద గుర్రపుడెక్కను తొలగిస్తున్న దృశ్యం

దెందులూరు: ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా రైతులకు సాగునీటి సమస్యలు లేకుండా చివరి రైతు పంట పొలాలకు వరకు సాగునీరందించే విధంగా చర్యలు తీసుకుంటామని గోదావరి కాలువ (డీసీ) చైర్మన్ వెలమాటి రామచంద్ర ప్రసాద్ (రాంబాబు) అన్నారు. మంగళవారం మండలంలోని ఉండ్రాజవరం గ్రామంలోని వంతెన వద్ద చేస్తున్న గుర్రపు డెక్క తొలగింపు పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ సుబ్రహ్మణ్యం, సత్యనారాయణపురం సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు పర్వతనేని రంగారావు, నున్న లక్ష్మణ్ బాబు, గండి రాజా తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



బావాయిపాలెంలో విజయకేతనం పుస్తకాలు అందజేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీలు

నిడమర్రు: పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జెడ్పీటీసీ కోడే కాశి అన్నారు. మంగళవారం బావాయిపాలెం జెడ్పీస్కూల్లో పదో తరగతి విద్యార్థులు జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో రూపొందించిన విజయకేతనం పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, గ్రామపెద్దలు ముత్యాల స్వామి, హెచ్ఎం కణితి కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే జరిమానా



సెక్షన్లపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ సుమతి

దెందులూరు: అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే అటువంటి వారికి లక్ష రూపాయలు జరిమానా విధిస్తామని దెందులూరు తహసీల్దార్, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ బి. సుమతి హెచ్చరించారు. మంగళవారం దెందులూరు తహసీల్దార్ కోర్టులో దెందులూరు పోలీసులు అసాంఘిక కార్యక్రమాలు పాల్పడుతున్న వారిని ప్రవేశపెట్టారు. వారికి ఇటీవల వచ్చిన చట్టాలు నేరాలకు సంబంధించి సెక్షన్లపై అవగాహన కల్పించారు. కేవలం అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన వారే కాకుండా సహకరించిన వారు, ప్రోత్సహించిన వారిపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దంత వైద్య వృత్తిలో మంచి పేరు సాధించాలి



పట్టాలు అందిస్తున్న రిజిస్ట్రార్ బి.రాధికా రెడ్డి, బిషప్ జయరావు

పెదవేగి: దంత వైద్య వృత్తిలో మంచి సేవ చేసి మంచి డాక్టర్‌గా పేరు సంపాదించుకోవాలని డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.రాధికారెడ్డి అన్నారు. దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంత కళాశాల 18వ స్నాతకోత్సవాన్ని బీడీఎస్ విద్యార్థులకు 14వ స్నాతకోత్సవాన్ని ఎండీఎస్ విద్యార్థులు మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ ఏలూరు పీఠాధిపతి రెవరెండ్ బిషప్ జయరావు అధ్యక్షతన నిర్వహించిన స్నాతకోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.రాధికా రెడ్డి మాట్లాడుతూ దంత వైద్య వృత్తిలో మంచి సేవ చేసి మంచి డాక్టర్‌గా పేరు సంపాదించుకోవాలన్నారు. విద్యార్థుల కు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. కరెవరెండ్ డాక్టర్ జార్జ్ అంతోని స్వామి, రెవరెండ్ ప్రకాష్ సిగిలి, కరస్పాండెంట్, సెక్రెటరీ ఫాదర్ జి.మోజెస్, ప్రిన్సిపాల్ స్లీవ రాజు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు సీతారామయ్య మృతి

దెందులూరు: రైతాంగ సమాఖ్య రాష్ట్ర నేత, వైఎస్సార్‌సీపీ నాయకుడు మునునూరి సీతారామయ్య మంగళవారం గాలాయగూడెం శివారు అక్కిరెడ్డిగూడెంలోని ఆయన స్వగృహంలో మృతి చెందారు. ఆయనకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. సీతారామయ్య మరణంపై దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, ఆయిల్‌ఫెడ్ రాష్ట్ర మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, వైఎస్సార్ సీపీ పెదవేగి మండల అధ్యక్షుడు జానంపేట బాబు, సర్పంచ్ చిలక వెంకట సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యురాలు సొంగ వెంకటేశ్వరమ్మ తదితరులు సంతాపం తెలిపారు.

గ్రామ ప్రణాళికలు తయారు చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో మనోజ్

ఉంగుటూరు: గ్రామ పంచాయతీల అభివృద్ధికి అధికారులు ప్రణాళికలు తయారు చేయాలని ఎంపీడీవో మనోజ్ తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మనోజ్ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. సమావేశంలో శానిటేషన్, సచివాయల ఉద్యోగులు హాజరశాతం పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ సహాయకులకు సూచనలు

ఉపాధి హామీ సహయకులకు, సాంకేతిక సిబ్బందికి రాష్ట్రస్థాయిలో వీడియో కన్ఫరెన్సు మంగళవారం నిర్వహించారు. ఈసమావేశంలో పాల్గొన్న పంచాయితీ కమిషనర్, ఉపాధిహామీ డైరెక్టరు పాల్గొని పలు సూచనలు చేశారు.

దెందులూరులో రెవెన్యూ సదస్సు

దెందులూరు: గ్రామాల్లో ఉన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రతి గ్రామంలోనూ గ్రామ సభలు నిర్వహిస్తున్నామని దెందులూరు తహసీల్దార్ బత్తుల సుమతి అన్నారు. మంగళవారం దెందులూరు గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట రెవెన్యూ సదస్సు నిర్వహించి, రైతుల నుంచి వినతులు తీసుకున్నారు. నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జి గారపాటి కొండయ్య చౌదరి, సర్పంచ్ తోట ఏసమ్మ, ఇప్పిలి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు పెనుబోయిన శేషారత్నం పాల్గొన్నారు.

జూదక్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు



గణపవరం: మాట్లాడుతున్న అధికారులు



భీమడోలు: కోడి పందేలు నిషేధంపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి



ఉంగుటూరు: సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ పూర్ణచంద్రప్రసాద్

గణపవరం: సంక్రాంతి సందర్భంగా జూదక్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అప్పారావు అన్నారు. మంగళవారం గణపవరం మండలం సరిపల్లె గ్రామ సచివాలయం వద్ద ప్రజలు, ప్రజాప్రతినిధులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు, పేకాట వంటివి నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సదస్సులో సత్యనారాయణ, ఎఎస్ఐ తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

భీమడోలు: సంక్రాంతి పండుగ ముసుగులో కోడి పందేలు, జూద క్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని భీమడోలు తహసీల్దార్ బి.రమాదేవి న్నారు. భీమడోలు ఎంపీపీ సమావేశ మందిరంలో మంగళవారం రెవెన్యూ, పంచాయతీ రాజ్, పోలీస్ శాఖలతో కోడి పందేలు, జూద క్రీడల నిషేధంపై మండల, గ్రామస్థాయిలో వివిధ బృందాల సభ్యులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధిగా హాజరైన తహసీల్దార్ బి.రమాదేవి, ఎస్సై వై.సుధాకర్, మండల పశు వైద్యాధికారిణి ఐ.రమ్యశ్రీలు తమ శాఖల పరిధిలోని అంశాలను వివిధ శాఖల సిబ్బందికి వివరించారు. ఎస్సై వై.సుధాకర్ మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు కోడి పందేలు, జూదాలను నిషేధించిందని, గ్రామాల్లో ఆంక్షలను అతిక్రమిస్తే వారిపై కోర్టు ధిక్కార కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బైండోవర్ కేసులు నమోదు చేసామన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, గ్రామ కార్యదర్శులు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, పశుసంవర్థక శాఖ సహాయకులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వై పూర్ణచంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కోడి పందేలు నిర్వహిస్తే వెంటనే సమాచారం పోలీసులకు గానీ, రెవెన్యూ అధికారులకు గానీ తెలియజేయాలన్నారు. అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వయోజన విద్య అక్షరాస్యత వలంటీర్లకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ శ్రీదేవి

దెందులూరు: యోజన విద్య అక్షరాస్యత ద్వారా శిక్షణ పొందిన డ్వాక్రా వలంటీర్లు, నిరక్షరాసులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఏలూరు జిల్లా వయోజనవిద్యా నోడల్ అధికారి కేవీవీ సత్యనారాయణ అన్నారు. దెందులూరు మండల డ్వాక్రా భవనంలో శనివారం వయోజన విద్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉల్లాస్ అక్షరాస్యత కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీఓ శ్రీదేవి చేతుల మీదుగా శిక్షణ పొందిన డ్వాక్రా వలంటీర్లకు పుస్తకాలు పంపిణీ చేశారు. భీమడోలు మండలంలోని డ్వాక్రా గ్రూపు మహిళలలో మొదటి విడతగా 270 మంది నిరక్షరాసులను గుర్తించి, వీరందినీ అక్షరాస్యులుగా చేసేందుకు 27 మంది వలంటీర్లు నియమించినట్లు సురేష్ కుమార్ తెలిపారు. వీరంతా ఆయా గ్రామాల్లోని నిరక్షరాసులకు 3 నెలలు పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తీర్ణత కోసం పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు.

అభయాంజనేయునికి ప్రత్యేక పూజలు

పెదపాడు: మండలంలోని అప్పనవీడులోని అభయాంజనేయ స్వామి ఆలయంలో భక్తులతో కిటకిటలాడింది. మంగళవారం సుమారం 200 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అన్నదానం నిర్వహించారు. ఆరుగొలనుకు చెందిన వేటుకూరి వెంకట రమణ రాజు, శృతి దంపతులు ఆర్థిక సాయం అందించారు.

గుండుగొలనులో చోరీ

భీమడోలు: గుండుగొలనులో ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి నగదును అపహరించుకుని పరారైనట్లు భీమడోలు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసారు. గ్రామానికి చెందిన నల్లపురాజు ఆంజనేయరాజు అనే వృద్ధుడు కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆతను గత నెల 24వ తేదీన తన ఇంటికి తాళం వేసి ఏలూరులోని బంధువుల ఇంటికి వెళ్లాడు. ఈనెల 6వ తేదీన ఇంటికి వచ్చేసరికి ఇంటిలోని తలుపులు, బీరువాను పగులకొట్టి అందులోని రూ.3వేల నగదును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించి పరారయ్యారని బాధితుడు ఆంజనేయరాజు తెలిపారు. బాధితుడి ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు మేరకు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

విద్యార్థుల రక్షణ కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్

పెదపాడు: విద్యార్థుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, వాటిపై అవగాహన కలిగి ఉండాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే రత్న ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే రత్న ప్రసాద్ పెదపాడు మండలంలోని వట్లూరులోని డాక్టరు బీఆర్ అంబేడ్కర్ గురకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న వసతులు, ఆహార పదార్థాల నాణ్యతతో పాటు విద్యార్థుల వసతి గదుల పరిశుభ్రత మెరుగుపరచాలని, దీంతోపాటు వారి రక్షణ కోసం మరింత జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో న్యాయవాది కె.సునీత, పాఠశాల ప్రిన్సిపాల్ దాసరి మేరీ ఝాన్సీ, గ్రంథపాలకురాలు ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధిపై శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న పంకజ్ కుమార్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధిపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్టు సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ కె.పంకజ్ కుమార్ అన్నారు. జిల్లాలో ఎంపికై న 40 మంది ఉపాధ్యాయులకు స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 2021వ సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా 30 పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, ప్రస్తుతం నాల్గో దశలో 9వ తరగతి చదువుతున్న సుమారు 4 లక్షల మందికి పైగా విద్యార్థులతో దాదాపు 5 వేల పాఠశాలల్లో అమలు చేస్తున్నట్టు చెప్పారు. దీని ద్వారా పిల్లల్లో అత్యుత్తమమైన వ్యవస్థాపక మనస్తత్వాన్ని, 21వ శతాబ్దపు అనేక నైపుణ్యాలను పెంపొందిచగలుగుతామని వివరించారు. సమస్యను గుర్తించి, పరిష్కారాన్ని కనుగొనడంలో సృజనాత్మకను పెంపొందించడానికి ఇది సహాయ పడుతుందని తెలిపారు. ప్రాజెక్టుల ద్వారా విద్యార్థులు నేర్చుకున్న విషయాలను ప్రదర్శించడంతో పాటు విద్యార్థుల్లో ప్రాథమిక ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించగలుగుతామని అన్నారు. ఇందుకు రాష్ట్ర వ్యాప్తంగా 10 వేల మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నామని, వీరిలో జిల్లా నుంచి 40 మందిని ఎంపిక చేశామని తెలిపారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏఎంఓ ఆర్ రామారావు, రాష్ట్ర ప్రోగ్రాం జోనల్ మేనేజర్ సీహెచ్ బ్రహ్మం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్కౌట్ మాస్టర్, గైడ్ కెప్టెన్‌లకు శిక్షణ

దెందులూరు: స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వారా విద్యార్థులు క్రమశిక్షణ, దేశభక్తి, స్వీయ అభివృద్ధి, సమాజ సేవ వంటి లక్షణాలు అలవడి పరిపూర్ణ మానసిక పరివర్తన తీసుకురావచ్చని స్కౌట్ కార్యదర్శి ఐ.భాస్కర్ అన్నారు. దెందులూరు మండలం గోపన్నపాలెంలోని హేలాపురి ఇంజినీరింగ్ కళాశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాల పరిధిలోని పీఎంశ్రీ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు స్కౌట్స్ మాస్టర్, గైడ్స్ కెప్టెన్‌లుగా పని చేయడానికి ఈ నెల 4 నుంచి 10వ తేది వరకు 57 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు డీఈఓ వెంకటలక్ష్మమ్మ ఏర్పాట్లు చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ఐ.భాస్కర్ మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా సమాజ సేవలో భాగస్వామ్యం కల్పించి, ఉన్నత విలువలు పెంపొందించుకోవచ్చన్నారు. విద్యార్థులకు రాజ్య పురస్కార్, రాష్ట్రపతి అవార్డు ద్వారా విద్య,ఉద్యోగాల్లో రిజర్వేషన్ సౌకర్యం పొందవచ్చనన్నారు. కార్యక్రమంలోస్కౌట్స్ వింగ్ ఎల్ఓసీ డి.ప్రసాద్, ఏఎల్‌టీ బిరుదుగడ్డ నాగేశ్వరరావు, జిల్లా స్కౌట్స్ ట్రైనింగ్ కమిషనర్ స్వర్ణ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

20 నుంచి కుష్టు వ్యాధిపై సర్వే

నిడమర్రు: ఈనెల 20 నుంచి కుష్టువ్యాధిపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కుష్టువ్యాధి నివారణ అధికారి కె. సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ఆశాడే సందర్భంగా నోడల్ అధికారి జె, మరియమ్మ అధ్యక్షతన సమావేశం జరిగింది. పీహెచ్‌సీ వైద్యులు డి. శ్రావణరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి క్షయ, నిమోనియా, కుష్టు, శ్వాసకోశ వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. శరీరంపై స్పర్శలేని మచ్చలు గుర్తిస్తే ఆరోగ్య సిబ్బందికి తెలియజేయాలన్నారు.

పాత కక్షలతో దాడి.. వ్యక్తికి గాయాలు



ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్త బొద్దాని పెద్దిరాజు

భీమడోలు: పోలసానిపల్లి గ్రామంలో పాతకక్షల నేపథ్యంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త బొద్దాని పెద్దిరాజును కొందరు వ్యక్తులు తలపై తీవ్రంగా గాయపర్చారు. ఈ ఘటన ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. గాయపడిన పెద్దిరాజు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వివరాల్లోకి వెళ్లితే.. గ్రామంలోని బొద్దాని పెద్దిరాజుకు, అదే ప్రాంతానికి చెందిన గారపాటి రాజులకు మధ్య కొంత కాలంగా పాత కక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం బొద్దాలి పెద్దిరాజు, గారపాటి రాజులకు మధ్య మరోసారి గొడవ జరిగింది. ఈ సంఘటనలో పెద్దిరాజును గారపాటి రాజుతో పాటు కొందరు వ్యక్తులు కర్రతో కొట్టి గాయపర్చారు. దీనితో పెద్దిరాజు తలకు బలమైన గాయాలు కావడంతో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అయితే గొడవలో గారపాటి రాజుకు కాలుకు గాయాలు కాగా ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి చేరాడు. దీనితో ఇరువురు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసారు. దీనితో భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



భీమడోలు హైస్కూలులో చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి

భీమడోలు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం 9, 10వ తరగతి బాలికలకు కిషోరి వికాసం కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సును నిర్వహించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఫోక్సో చట్టం, బాల్య వివాహాలు, స్వీయ రక్షణ, వృత్తి విద్య, జీవనోపాధి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సదస్సుకు సైన్స్ టీచర్ గౌరీ అధ్యక్షత వహించారు. బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. బాలికలు చక్కగా చదువుకొని ఉన్నత స్థితికి చేరుకోవాలన్నారు. వివాహాల విషయంలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. ఎటువంటి చెడు వ్యసనాల బారిన పడకుండా తమ జీవితానికి మంచి మార్గాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, బాలికలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం



పిప్పరలో మాట్లాడుతున్న మంగరాజు

గణపవరం: ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని గతంలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, మళ్లీ వర్గీకరణ రాష్ట్రాల పరిధిలో చేసుకోవచ్చునని చెప్పడం దారుణమని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. మంగళవారం గణపవరం మండలం పిప్పరలో మాలమహానాడు గణపవరం మండల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. తొలుత డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణ పేరుతో మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టిన పాలకులు వారిని శాశ్వత శత్రువులుగా చేయడానికి కుట్రలు చేస్తున్నారని, మాదిగలు ఈవిషయం గుర్తించాలన్నారు. మాలలను ద్రోహులుగా చిత్రించడం మంద కృష్ణమాదిగకు తగదన్నారు. దొడ్డిదారిని వర్గీకరణ చేయడానికి రాజీవ్‌రంజన్ మిశ్రా కమిషన్‌ను నియమించిందని, దీనికి వ్యతిరేకంగా మాలలు అంతా ఉద్యమానికి ముందుకు రావాలని పిలుపు ఇచ్చారు. ఈసమావేశంలో చోడదాసి జైపాల్, బిఎస్‌రావు, పద్మారావు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.